నేడు ప్రజావాణి రద్దు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పమేలాసత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. భూభారతి కొత్త ఆర్వోఆర్ రెవెన్యూ చట్టం అమలు నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారన్నారు. అధికారులంతా ఆ సదస్సులకు హాజరు కావలసి ఉన్నందున ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

హస్త వ్యస్తం



- గందరగోళంలో కాంగ్రెస్ శ్రేణులు
- నేతల ఆధిపత్య పోరుతో ఇబ్బందులు
- మార్పు కోసం సీనియర్ల ప్రయత్నాలు
- అధిష్ఠానం దృష్టికి పార్టీ పరిస్థితి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఆ పార్టీ శ్రేణులు తమది అధికార పార్టీ అనే భావనలోనే లేరు. ఈ నియోజక వర్గంలో ఎమ్మెల్యే బీఆర్ఎస్‌కు చెందిన వారు కాగా, ఎంపీ బీజేపీ నుంచి గెలిచారు. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజక వర్గ ఇన్‌చార్జిలు సొంత నిర్ణయాలు తీసుకునే పరిస్థితిలో లేక ఉత్సవ విగ్రహాలుగా మారారనే భావన పార్టీ శ్రేణుల్లో నెలకొన్నది. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని నియమించినా జిల్లా మంత్రి ఎవరన్నది మాత్రం బేతాళ ప్రశ్నగా మారింది. ఉమ్మడి జిల్లా పరిధిలో పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు ఇద్దరు మంత్రులుగా ఉండగా, ఈ ఇద్దరు కూడా రాజకీయ ఆధిపత్యం కోసం పోటీపడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. అధిష్ఠానం ఏ విషయం తేల్చక పోవడంతో పార్టీ ద్వితీయ శ్రేణి నేతలు, కార్యకర్తల పరిస్థితి అడకత్తెరలో పోక చెక్కలా మారిందని వాపోతున్నారు.

ఎవరికి వారే..

ఒకరి వద్దకు వెళితే మరొకరికి కోపం, ఒకరిని కలిసినట్లు మరొకరికి తెలిస్తే రాజకీయంగా కార్డు కట్ అవుతుందనే భయంతో మెదలాల్సిన పరిస్థితి ఉంది. నామినేటెడ్ పదవుల భర్తీ లేదు, మంచికి, చెడుకు కార్యకర్తలను పట్టించుకునే వారు లేరు. అధికార పార్టీలో ఉన్నారనే భావనతో ఏ అధికారి వద్దకైనా ఏ పని కోసమైనా వెళ్లే పరిస్థితి లేదు. దీంతో తాము అధికార పార్టీలోనే ఉన్నామా, తమ ప్రభుత్వమే అధికా రంలో ఉందా అనే పరిస్థితిలో కాంగ్రెస్ కార్యకర్తలు కొట్టుమిట్టాడుతున్నారు. సుడా చైర్మన్‌గా కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని ముఖ్యమంత్రి నియమించారు. ఈ నియామకం వెనుక మరో మంత్రి శ్రీధర్‌బాబు హస్తం ఉందనే కారణంతో మంత్రి పొన్నం ప్రభాకర్ దానిని వ్యతిరేకించారు.

తన నియామకం తర్వాత మంత్రిని కలవడానికి వెళితే నరేందర్‌రెడ్డితో సానుకూలంగా వ్యవహరించలేదని తెలిసింది. ఇప్పటికీ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొంటున్న కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం ఆయనకు ఇవ్వడం లేదని, చివరికి అధికారిక కార్యక్రమాల్లో కూడా వేదిక పంచుకునే పరిస్థితి లేకుండా పోయిందని కార్యకర్తలు అంటున్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ పరిస్థితి అలాగే ఉంది. సత్తు మల్లేశంను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ పదవిలో నియమించారు.

ముఖ్యమంత్రి అనుచరుడిగా సత్తు మల్లేశానికి పేరుంది. ఆయన నియామకంపై కూడా మంత్రి పొన్నం సుముఖంగా లేరని, ఇద్దరి మధ్య సఖ్యత అంతంత మాత్రంగానే ఉందని ప్రచారం జరుగుతున్నది. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న పురమల్ల శ్రీనివాస్ మంత్రి పొన్నం అనుచర వర్గం నుంచి దూరమయ్యారు. తనకు నియో జకవర్గ ఇన్‌చార్జిగా స్వతంత్రంగా వ్యవహరించే అవకాశం ఇవ్వ డం లేదని విమర్శించారు. కరీంనగర్ నియోజక వర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఏ కార్యక్రమంలో పాల్గొన్నా వీరంతా వాటికి దూరంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నది.

మంత్రి వర్సెస్ మంత్రి

శ్రీధర్‌బాబు నియోజకవర్గం పెద్దపల్లి జిల్లాలో ఉండగా మం త్రి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గం హుస్నాబాద్ సిద్దిపేట జిల్లాలో ఉంది. ఆ నియోజక వర్గానికి సంబంధించిన రెండు మండలాలు కరీంనగర్ జిల్లాలో ఉన్నాయి. సాంకేతికంగా జిల్లా మంత్రిగా వ్యవహరించే అవకాశంతో పొన్నం ప్రభాకర్ జిల్లా మంత్రిగా ఉంటున్నారు.


ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు శ్రీధర్‌బాబు మంత్రిగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో నియోజకవర్గంలో విస్తృత సంబంధాలను ఏర్పరచు కున్నారు. ఆ సంబంధాల నేప థ్యంలో పార్టీ శ్రేణులు అవసరాల కోసం ఆయన వద్దకు వెళితే ఆయన వర్గీయులుగా ముద్ర వేస్తున్నారని వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో కరీంనగర్ నియోజక వర్గంలో కాంగ్రెస్ నేతల్లో, శ్రేణుల్లో గందరగోళ పరిస్థితి నెలకొన్నది.

పరిస్థితి మార్చాలని..

తమను ఈ పరిస్థితి నుంచి తప్పించేదెవరు అని అందరూ ఆందోళనలో ఉండగా, కొందరు సీనియర్లు కొత్త రాజకీయాలకు తెరతీశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నా కరీంనగర్ నియోజక వర్గంలో పార్టీ ఉండి లేని మాదిరిగా తయారైంది. పార్టీ అభ్యర్థులు జిల్లా కేంద్ర నియోజక వర్గంలో అసెంబ్లీకి నాలుగు సార్లు, పార్లమెంట్‌కు మూడు సార్లు ఓడిపోయారు. ప్రస్తుత పరిస్థితుల్లో కరీంనగర్ కార్పొరేషన్‌లోనూ ఎటువంటి ప్రభావం చూపించలేమనే భావన ఆ పార్టీ వర్గాల్లో ఉంది. ఈ పరిస్థితిని చూసి కొందరు సీనియర్లు కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకు వచ్చేందుకు ఏదో ఒక ప్రయత్నం చేయాలని ఇక్కడ నెలకొన్న పరిస్థితిని సమగ్రంగా అధిష్ఠానం దృష్టికి తీసుకు వెళ్లి మార్పు కోసం ప్రయత్నించాలని భావిస్తున్నట్లు తెలిసింది.

మాజీ ఎమ్మెల్సీ, పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు రెండు రోజుల క్రితం కరీంనగర్‌లో సమావేశమై ఈ విషయమై చర్చించారని, సమావేశంలో పాల్గొన్న వారు రాజకీయంగా పోటీ చేసే ఆసక్తిని ప్రదర్శించక పోగా కేవలం పార్టీ పరిస్థితిని మెరుగుపర్చేందుకే ఈ భేటీ ఏర్పాటు చేశామని సమాచారం. మంత్రుల మధ్య విభేదాలు తొలగించేందుకు చర్యలు తీసుకుని ఎవరో ఒకరికి ఇన్‌ఛార్జి బాధ్యలు అప్పగించి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని మెరుగు పర్చాలని బూత్ స్థాయి నుంచి పార్టీ శ్రేణుల్లో చైతన్యం నింపి స్థానిక సంస్థల ఎన్నికల నాటికి గెలుపు దిశగా పయనించేందుకు సన్నద్ధం చేయాలని ఈ భేటీలో వారు అభిప్రాయ పడ్డట్లు సమాచారం. మొదటి నుంచి పార్టీలో పనిచేస్తూ వస్తున్న సీనియర్లను గుర్తించి వారికి వివిధ పదవుల నియామకంలో అవకాశాలు కల్పించాలని, గెలిచే అవకాశాలు ఉన్న వారిని పోటీలో దింపేందుకు పార్టీ చర్యలు తీసుకోవాలని

మిగతా 8వ పేజీలో



పశుగ్రాసానికి గిరాకీ

రూ. 70 నుంచి 90 వరకు గడ్డి కట్ట విక్రయం



ఇప్పల్‌నర్సింగాపూర్‌లో నిల్వ చేసిన గడ్డి కట్టలు

హుజూరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): యాసంగిలో పశువులు మేసే వరి గడ్డికి గిరాకీ పెరిగింది. మెట్ట ప్రాంత రైతులు ఎస్సారెస్పీ ఆయకట్టు కింద నుంచి పశువుల మేత కోసం గడ్డికట్టలను తరలిస్తున్నారు. గతంలో వరి కోసిన తర్వాత వరి గడ్డిని కుప్పలుగా వేసేవారు. ఒక ప్రాంతం నుంచి ఇంకో ప్రాంతానికి వరిగడ్డిని ట్రాక్టర్ల ద్వారా తరలించేవారు. దీంతో తరుచూ ప్రమాదాలు జరిగి రైతుల ప్రాణాలు పోగా, మరికొంత మంది వికలాంగులయ్యారు. దీంతో వరి గడ్డి కట్టలు కట్టేందుకు మిషన్లు వచ్చాయి. రైతులు వాటిపై మొగ్గు చూపుతున్నారు. వరి గడ్డి కట్టలను ట్రాక్టర్ల ద్వారా రవాణా చేసుకోవచ్చు. తక్కువ ప్రాంతంలో ఎక్కువ నిల్వ చేసుకోవచ్చు. హుజూరాబాద్ పరిసర ప్రాంతాల్లో పలు డెయిరీలు ఉండడంతో పలువురు రైతులు, వ్యవసాయ కూలీలు పశుపోషణపై దృష్టి సారించారు.

పశు పోషణ కోసం ముఖ్యంగా రైతులకు వరి గ్రాసం అవసరం ఉంటుంది. దీంతో పశువుల కోసం పశుగ్రాసాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఈ యాసంగిలో హుజూరాబాద్ డివిజన్‌లో 70 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పటికే 65 శాతం కోతలు పూర్తయ్యాయి. గతంలో చేతితో కోతలు చేసే సమయంలో వెంటనే కట్టలు కట్టేవారు. హార్వెస్టర్లు అందుబాటులోకి వచ్చిన కొత్తలో గడ్డిని కట్టలు కట్టేందుకు రైతులు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం ట్రాక్టర్ ద్వారా గడ్డి కట్టలు కట్టే మిషన్ అందుబాటులోకి వచ్చింది. ట్రాక్టర్ ద్వారా గడ్డి కట్ట కడితే 35 రూపాయలు, దానిని నిల్వ చేసేందుకు 30 రూపాయల చొప్పున కూలి తీసుకుంటున్నారు. గడ్డి కట్టను అమ్మితే రైతులకు 70 నుంచి 90 రూపాయల వరకు వస్తుంది. యాసంగి వరిధాన్యం కోయడంతో రైతులు గడ్డి కట్టలు కట్టిస్తున్నారు. పాడి పోషణ చేసే వారు గడ్డి కట్టలను కొనుగోలు చేస్తున్నారు. ఇప్పుడు గడ్డి కట్టలు కొనుగోలు చేస్తే ఎనిమిది నెలల వరకు రైతులు పాడి పోషణ కోసం కాపాడుకోవాల్సి వస్తుంది. వచ్చే వర్షాకాలం వరిధాన్యం పంట చేతికొచ్చేంత వరకు ఈ గడ్డి కట్టలను రైతులు నిల్వ చేసుకుంటారు.

పశువుల పోషణకు గడ్డి కొన్నాను..

పోతుగంటి రమేష్, ఇప్పల్‌నర్సింగాపూర్



పశువుల పోషణకు వరి గడ్డి కట్టలను కొనుగోలు చేశాను. నాకు ఎలాంటి భూమి లేదు. పాడి పోషణకు అవసరమయ్యే వరి గడ్డి కట్టలను కొనుగోలు చేసి నిల్వ చేశాను. ఇప్పుడు కొనుగోలు చేసిన గడ్డి కట్టలు ఎనిమిది నెలలు కాపాడుకోవాలి. పశువులకు గడ్డి వేస్తేనే పాల దిగుబడి వస్తుంది.

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



జగ్గయ్యపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మానకొండూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హెచ్చరించారు. మండలంలోని జగ్గయ్యపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతులు దళారీలను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకు వచ్చి మద్దతు ధర పొందాల న్నారు.

తరుగు పేరిట కోత విధిస్తే చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు. 40 కిలోల 600 గ్రాముల కంటే ఎక్కువగా తూకం వేయవద్దని సూచించారు. తూకం వేసిన తర్వాత రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఎం ఓదెలు, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి టి సంపత్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్



సందేశమిస్తున్న పాస్టర్



సీఎస్ఐ వెస్లీ కేథడ్రల్ చర్చిలో గీతాలు ఆలపిస్తున్న మహిళలు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఈస్టర్‌ను (పునరుత్థాన పండుగ) ఆదివారం క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అన్ని చర్చిల్లో ఉదయం ఐదు గంటలకు సన్‌రైజ్ ఆరాధనను జరిపారు. క్వాయర్స్ బృందం, చిన్నారులు ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. సీఎస్ఐ వెస్లీ కేథడ్రల్ చర్చిలో పాస్టరేట్ చైర్మన్ ఆర్ పాల్ కొమ్మాలు సందేశాన్ని ఇచ్చా రు. కార్యక్రమంలో ప్రెస్బిటర్ మధుమోహన్, కార్యదర్శి సీహెచ్ దేవదాసు, వర్డర్ ఎస్ ప్రేంకుమార్, ట్రెజరర్ జి నిల్సన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. క్రిస్టియన్ కాలనీ సీఎస్ఐ సెంటినరీ వెస్లీ చర్చ్‌లో పాస్టరేట్ చైర్మన్ ఎస్ జాన్ సందే శాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రెస్బిటర్ ఎం పింటు, కార్యదర్శి సి నారాయణ, కోశాధికారి సంజయ్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. జ్యోతీనగర్ లూర్దుమాత చర్చ్‌లో ఫాదర్ తుమ్మ సంతోష్ రెడ్డి సందేశమివ్వగా చర్చ్ కమిటీ అధ్యక్ష ఉపాధ్యక్షులు డి ఇన్నారెడ్డి, బి జార్జిరెడ్డి, కార్యదర్శి మరియకుమార్, సభ్యులు జరోంరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, కోటి, ఇన్నారెడ్డి, సునీల్‌రెడ్డి, గోపు రవి పాల్గొన్నారు. విజయ రఘు నందన్ రోడ్‌లోని సెయింట్‌మార్క్ చర్చ్, జగిత్యాల రోడ్, బేతేలు చర్చ్‌లో ప్రార్థనలు నిర్వహించారు.

రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయాలని బీజేపీ కుట్ర

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు




మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

భగత్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యుడు కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ఆదివారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మావోయిస్టులను చంపే అధికారం అమిత్ షాకు ఎవరిచ్చారని, మావో యిస్టులను చంపమని రాజ్యాంగంలో ఏమైనా పొందుపరిచారా అని ప్రశ్నించారు. తప్పు చేస్తే కేసులు పెట్టి కోర్టుల ముందు హాజరుపరచాలి కాని చంపడం ఏంటని, దేశంలో ప్రశ్నించే వారిని చంపడమే బీజేపీ ఎజెండానా అని అన్నారు.

మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి బీజేపీ కుట్ర పన్నుతుందన్నారు. వక్ఫ్ బోర్డు కమిటీలో ముస్లి మేతరులను ఏలా నియమిస్తారని ప్రశ్నించారు. దేశంలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదని, కార్మిక చట్టాలను తీసి వేసి నాలుగు కోడ్‌లుగా విభజన చేస్తుందన్నారు. రైతుల సమస్యలు అలాగే ఉన్నాయని, పేదరికం లేదని చెప్పడం కోసం చాలా తెలివిగా రెండు మూడు శాతం మాత్రమే ఉందని బీజేపీ అబద్ధాలు చెబుతుందన్నారు. తెలంగాణలో ప్రజలను ఓట్లు ఎలా అడుగుతారని, విభజన హామీలు, తెలంగాణకు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చామని అడుగుతారా అని ప్రశ్నించారు. రాష్ట్రం నుంచి కేంద్రానికి ఇచ్చే ఆదాయంలో 2.4 శాతం మాత్రమే రాష్ట్రానికి తిరిగి ఇస్తున్నారని, ఉత్తర ప్రదేశ్‌కు 17 శాతం బిహార్‌కు పది శాతం నిధులు ఇస్తూ ఏకపక్షంగా వ్యవహరి స్తుందన్నారు. తెలంగాణలో పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందన్నారు.

రాష్ట్రంలో ఆర్టీసీ, సింగరేణి, జెన్‌కో సంస్థలను ప్రైవేట్ సంస్థలు వారి చేతుల్లోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని, ప్రభుత్వం వాటిని తిప్పి కొట్టాలన్నారు. లేని పక్షంలో స్నేహ పూర్వకంగా కలిసి ఉన్న తాము ఉద్యమాలు నిర్వహించక తప్పదన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే పోరాటాలకు వెనుకాడమన్నారు. సమా వేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, కొయ్యడ సృజన్ కుమార్, అశోక్, సమ్మయ్య పాల్గొన్నారు.







దొంగల బీభత్సం

- కోళ్లమద్దిలో తాళం వేసిన ఇంట్లో చోరీ
- 5 తులాల బంగారం, 100 తులాల వెండి, రూ. లక్ష నగదు అపహరణ

గంభీరావుపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం కోళ్ళమద్దిలో శనివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన ఇంట్లో చొరబడి భారీ ఎత్తున బంగారం, వెండి, నగదును ఎత్తుకెళ్లారు. కోళ్ళమద్దిలోని లింబయ్య తన బార్య శాంతవ్వ ఆరోగ్యం బాగాలేక ఆసుపత్రికి వెళ్లారు. ఇంటికి తాళం వేసి లింబయ్య కుటుంబం 10 రోజులుగా ఆసుపత్రులు తిరుగుతున్నారు. ఇదేక్రమంలో శనివారం రాత్రి దొంగలు లింబయ్య ఇంటికి వేసిన తాళాన్ని పగులగొట్టి లోనికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. 3తులాల బంగారు పుస్తెల తాడు, తులం చైన్, తులం కమ్మలు, 70 తులాల వెండి కడియాలు, 30 తులాల పట్ట గొలుసులు, లక్ష నగదును దొంగలు ఎత్తుకెళ్ళినట్టు బాదితులు తెలిపారు. స్థానిక ఎస్‌ఐ ప్రేమానందం సిబ్బందితో వెళ్లిదొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించారు.

వడ్ల లోడ్ ట్రాక్టర్ బోల్తా..

శంకరపట్నం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంకాయగూడెం శివారులోని కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై ఆదివారం వడ్ల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తాపడింది. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామానికి చెందిన ఓరైతు వడ్లను ట్రాక్టర్‌తో మానకొండూర్ శివారులోని ఓ సీడ్‌ప్లాంట్‌కు తరలిస్తున్నాడు. ఈక్రమంలో వంకాయగూడెం చేరుకోగానే టైర్ పంచర్ కావడంతో ఒక్కసారిగా ట్రాక్టర్ రోడ్డున పక్కనపడిపోయింది. ఆ సమయంలో అటుగా ఎవరు రాకపోవడంతో ప్రమాదం తప్పింది.

గుడుంబా పట్టివేత

రామగిరి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్‌లో గుడుంబా అమ్మకాలు చేపడుతున్న మహిళను పోలీసులు ఆదివారంరాత్రి పట్టుకున్నట్లు ఎస్‌ఐ చంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన కోటగడ్డల రమాదేవి ఇంటివద్ద గుడుంబా విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు దాడి చేసి పట్టుకొని మూడులీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని మహిళ పై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పావులు కదిపితే ప్రత్యర్థులు చిత్తే



- చదరంగంలో రాణిస్తున్న క్రీడాకారులు
- జాతీయ స్థాయిలో ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): లక్ష్యాన్ని నిర్ణయించుకొని ముందుకుపోతే ఏ రంగంలోనైనా విజయాలు వరిస్తాయి. పదేళ్లకే జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి తమకంటే మెరుగైన రేటింగ్ ఉన్న క్రీడాకారులపై విజయాలు సాధిస్తున్నారు జిల్లాకు చెందిన చదరంగ క్రీడాకారులు. కరీంనగర్‌కు చెందిన ఇరుకుల్ల శ్లోకాయుక్తి, గంగిరెడ్డి శ్రీహంసిని, లిఖిత్ మాణిక్యరావు, ఐ కాశవేన సుప్రీత్ జాతీయ స్థాయి పోటీల్లో, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. ఫలితంగా వీరు ఫిడే రేటింగ్‌తోపాటు పలు అవార్డులను సొంతం చేసుకున్నారు.

ఎనిమిదేళ్ల నుంచే పోటీల్లో పాల్గొంటూ..



జిల్లా కేంద్రంలోని కృష్ణా నగర్‌కు చెందిన ఇరుకుల్ల శ్లోకాయుక్తి ఎనిమిది సంవత్సరాల వయస్సు నుంచే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటోంది. అండర్-14, అండర్- 17 ఎస్జీఎఫ్, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలను సాధించింది. పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో జరిగిన 68వ జాతీయ స్థాయి అండర్-19 చదరంగ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. హిమాచల్ ప్రదేశ్‌లో జరిగి న 65వ జాతీయ స్థాయి అండర్-14 చదరంగ పోటీ ల్లో తెలంగాణ రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహ రించింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఇంటర్ చదువుతోంది. అంతర్జాతీయ క్రీడాకారిణిగా ఎదగాలనేదే తన లక్ష్యమని శ్లోకాయుక్తి చెబుతోంది.

జాతీయ స్థాయి పోటీల్లో పతకం సాధించడమే లక్ష్యంగా..



జిల్లా కేంద్రానికి శ్రీహంసిని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. కరీంనగర్, హైదరాబాద్, హనుమకొండ, రంగారెడ్డి, నిజామా బాద్ జిల్లాల్లో జరిగిన ఎస్‌జీఎఫ్, అసోసియేషన్, ఓపెన్, సీఎం కప్ చదరంగ పోటీల్లో పాల్గొన్నది. ఇంతవరకు 13 రాష్ట్రస్థాయి, ఒక జాతీయస్థాయి చదరంగ పోటీల్లో పాల్గొని ప్రతిభచాటి పతకాలను సొంతం చేసుకుంది. 2023లో హనుమకొండలో జరిగిన ఓపెన్ టు ఆల్ చదరంగ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటి యంగెస్ట్ గర్ల్ అవార్డును సొంతం చేసు కుంది. 2024 సెప్టెంబరులో కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌లో జరిగిన 37వ జాతీయస్థాయి అండర్-7 బాలికల చదరంగ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఈ రాష్ట్రానికి పత కం సాధించడమే తన ధ్యేయమని శ్రీహంసిని తెలిపింది.

ఫిడే రేటింగ్ పోటీల్లో ప్రతిభ



కరీంనగర్‌కు చెందిన లిఖిత్ మాణిక్యరావు చిన్ననాటి నుంచే రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతున్నాడు. హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, జగిత్యాల, నిజామాబాద్ తదితర ప్రాం తాల్లో జరిగిన ఎస్‌జీఎఫ్, అసోసియేషన్, ఓపెన్ ఏడు రాష్ట్రస్థాయి చదరంగ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాడు. 2024లో హైదరాబాద్‌లో జరిగిన 37 జాతీయ అండర్-11 బాలబాలికల రేటింగ్ చదరంగ పోటీల్లో పాల్గొని 57 పాయింట్లు సాధించాడు. హైదరాబాద్‌లోనే జరిగిన మొదటి అంతర్జాతీయ ఓపెన్ ఫిడే రేటింగ్ చదరంగ పోటీల్లో పాల్గొని మంచి రేటింగ్ సాధించాడు. 2023లో మహారాష్ట్ర లోని పూణేలో జరిగిన అఖిల భారత ఓపెన్ ఫిడే రేటింగ్ చదరంగ పోటీల్లో పాల్గొని ఉత్తమ రేటింగ్ సాధించాడు. అంతర్జాతీయ చదరంగ పోటీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించడమే తన లక్ష్యమని లిఖిత్ మాణిక్యరావు అంటున్నాడు.

రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం



కరీంనగర్‌కు చెందిన కాశవేన సుప్రీత్ ఆరు సంవత్సరాలుగా చదరంగంలో శిక్షణ పొందుతున్నాడు. కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, మహబూబ్ నగర్, ఆదిలాబాద్, తదితర జిల్లాల్లో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్, ఓపెన్ 13 టోర్నమెంట్లలో పాల్గొని ప్రతిభ చాటాడు. 2024లో మధ్య ప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి అండర్-17 చదరంగ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతి నిధ్యం వహించాడు. తమిళనాడు రాష్ట్రంలోని వెల్లూరులో 2023 డిసెంబరులో జరిగిన 67వ ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి అండర్-14 చదరంగ పోటీల్లో పాల్గొని నాలుగో స్థానంలో నిలిచాడు. 2023లో కరీంనగర్ వైశ్య భవన్‌లో జరిగిన అఖిల భారత ఫిడే రేటింగ్ చదరంగ పోటీల్లో పాల్గొన్నాడు. ప్రపంచ చదరంగ చాంపియన్ గుకేష్ తనకు ఆదర్శ మని కాశవేన సుప్రీత్ అంటున్నాడు.







న్యాయం చేయాలని..
బాధిత కుటుంబం ధర్నా



కరీంనగర్ అల్కాపురి కాలనీలో ధర్నా చేస్తున్న బాధితులు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా సారంగాపూర్ తహసీల్దార్‌కార్యాలయంలో పనిచేస్తున్న రెవెన్యూఉద్యోగి కొయ్యడ లాస్య, ఆమె భర్త రమేష్ తమ డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారని వారి ఇంటి ఎదుట ఆదివారం బాధితులు ధర్నా చేశారు.

బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గౌరవెల్లికి చెందిన భైరి చిరంజీవి కుటుంబానికి ఉన్న వ్యవసాయభూమి, ఇల్లు గౌరవెల్లి రిజర్వాయర్‌లో ముంపునకు గురైంది. ఆ భూమికి ప్రభుత్వం పరిహారం కింద రూ.60లక్షలు అందజేసింది. డిప్యూటీ తహసీల్దార్ కొయ్యడ లాస్య, ఆమె భర్త రమేష్ సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం జనగాంశివార్లలోని సర్వే నంబర్ 505, 507, 508లో తొమ్మిది ఎకరాల 16గుంట భూమి తమ పేరిట ఉందన్నారు. దానిని విక్రయిస్తామని భైరి చిరంజీవి, ఆయన బావ శ్రీనివాస్‌కు చెప్పారు. దీంతో చిరంజీవికి ప్రభుత్వం అందజేసిన డబ్బులు రూ.60లక్షలతో లాస్య, రమేష్‌కు చెందిన భూమిని కొనుగోలు ఒప్పందం శ్రీనివాస్ పేరిటచేశాడు. డబ్బులు మొత్తం ముట్టజెప్పినప్పటికీ రిజిస్ట్రేషన్ చేయకుండా కాలయాపన చేయడంతో బాధితులు కొద్దిరోజుల కిందట నిల దీశారు. దీంతో ఆ భూమిపై కోర్టులో విచారణ జరుగుతోందని చెప్పారు. కోర్టుకేసులో ఉన్న భూమిని మమ్మల్ని నమ్మించి విక్రయించారని బాధితులు ఆరోపించారు. తాము ఇచ్చిన డబ్బులు తిరిగి చెల్లించాలని అడిగితే బెదిరింపులకు పాల్పడు తున్నారని బాధితులు వాపోయారు. ఈ విషయంపై కరీంనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా రెవెన్యూఉద్యోగి లాస్యతోపాటు ఆమె భర్తపై కేసు నమోదైనట్టు బాధిత కుటుంబానికి చెందిన చొప్పరి శ్రీనివాస్ తెలిపారు. ఉద్యోగం పోతుందని డబ్బులు తిరిగి చెల్లిస్తామని చెప్పిన రమేష్ తనకు చెక్కు ఇచ్చారని, ఆ చెక్కు కూడా రెండుసార్లు బౌన్స్ అయిందని తెలిపారు. అప్పటి నుంచి లాస్య, రమేష్ దంపతులకు ఫోన్ చేసినా స్పందించడం లేదన్నారు. దీంతో ఆదివారం కరీంనగర్ అలకాపురి కాలనీలోని లాస్య ఇంటి వద్ద నిరసనకు దిగామన్నారు. సమాచారం అందు కున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడి ఆందోళనను విరమింపచేశారు. తమకు అన్యాయం చేసి, మోసానికి పాల్పడిన లాస్య, ఆమె భర్త రమేష్‌పై చట్టపర మైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బాధితులు కోరారు.

జేఎన్టీయూలో రిక్రూట్‌మెంట్ పరీక్షలు



జేఎన్టీయూలో ఫీల్డ్ అసిస్టెంట్ అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

రామగిరి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఉదయం ఫీల్డ్ అసిస్టెంట్, మధ్యాహ్నం రికార్డు అసిస్టెంట్ పోస్టులకు పరీక్షలు జరిగాయి. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్యోగాలకు ఫీల్డ్ అసిస్టెంట్‌కు జరిగిన పరీక్షలో 100 మందికిగాను 64 మంది హాజరు కాగ 36 మంది గైర్హాజరైయ్యారు. మధ్యాహ్నం రికార్డు అసిస్టెంట్ పరీక్షలకు 100మందికి గాను 67మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఎలాంటిఅవాంఛనీయ సంఘటనలు జరగకుండా రామగిరిఎస్‌ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

కారు ఢీకొని బాలుడు మృతి



శివరాజ్‌కుమార్(ఫైల్)

కోల్‌సిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని గంగానగర్‌లో ఆదివారం కారు ఢీకొని పులిపాక శివరాజ్‌కుమార్(3) మృతిచెందాడు. బాలుడు ఆడుకుంటుండగా ఇంటిపక్కన ఉండేవ్యక్తి గమనించడకుండా కారు నడపడంతో బాలుడికి తగిలి తీవ్రగాయాలయ్యాయి. అతన్ని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. కారు నడిపిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వన్‌టౌన్ ఎస్‌ఐ భూమేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టిన మజ్లిస్

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టిన బడా చోర్ మజ్లిస్ అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా దారుసలాంలో వక్ఫ్ ఆస్తులు కాజేసిన బడా చోర్ నాయకులతో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభఏర్పాటు చేయించారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం మూడు పార్టీలు ఒక్కటేనన్నారు. మూడు పార్టీలు ముస్లిం ఓట్లు దండుకుని వారిని ఆదుకోకుండా వక్ఫ్ ఆస్తులను దోచుకు తింటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశవ్యాప్తంగా9లక్షల ఎకరాల వక్ఫ్‌భూముల ద్వారా 10లక్షలకోట్లకు పైగా ఆస్తులున్నా ఏ పేదముస్లింలకు లాభం చేశారో చెప్పా లని డిమాండ్ చేశారు. అంబేద్కర్ వారసులం మేమే నని, రాజ్యాంగ బద్దంగా మోదీప్రభుత్వం పని చేస్తుందన్నారు. హైదరాబాద్ ఓల్డ్‌సిటీలో ఇప్పటివరకు ఒక్కఅంబేద్కర్ విగ్రహంలేదని, పేద ముస్లింలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో వక్ఫ్ సవరణ చట్టం అమలు చేస్తున్నట్లు వివరించారు.

అకాలవర్షాలు, వడగండ్లవానలతో వేలాది ఎకరాల్లో పంటదెబ్బతిని రైతులంతా అల్లాడుతుంటే ఆదుకోవాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి జపాన్ పర్యటన పేరుతో విదేశాలకు వెళ్లడమే మిటని ప్రశ్నించారు. వక్ఫ్ ఆస్తులను దోచుకున్న బడాచోర్లంతా కలిసి బీజేపీపై విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అంబేద్కర్ పెట్టిన భిక్షవల్లే ప్రధాని కాగలిగానని పార్లమెంట్‌లో ప్రకటించిన మహానేత నరేంద్ర మోదీయేనన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో దళిత, బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారాన్ని అందించిన గొప్ప పార్టీ బీజేపీ అన్నారు. అంబేద్కర్ పేరును ఉచ్చరించే అర్హత కూడా ఒవైసీకి లేదన్నారు. వక్ఫ్ ఆస్తులపై యేటా 12 వేల కోట్ల రూపాయలకు పైగా ఆదాయం వస్తుంటే ఆ సొమ్మునంతా దిగమింగుతోంది మజ్లిస్ కాదా అని ప్రశ్నించారు. ఒక్క తమిళనాడులోనే 2వేలకోట్ల విలువైన వక్ఫ్‌ఆస్తులను ఆక్రమించుకుంది నిజంకాదా అన్నారు. రాముని గురించి ప్రశ్నించే వారికి వక్ఫ్ ఆస్తుల ఆక్రమణలపై నిలదీసే దమ్ముందా అని ప్రశ్నించారు. ఒవైసీ కుటుంబంతోపాటు మజ్లిస్ నాయకులు, సోకాల్డ్ వక్ఫ్‌బోర్డు సభ్యులంతా వక్ఫ్ ఆస్తులను దోచుకుని ఆసుపత్రులు, విద్యాసంస్థలు, వ్యా పారసంస్థలు నిర్మించి కోట్ల రూపాయల వ్యాపారం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. వక్ఫ్‌భూముల్లో ఒక్క గజం అయినా పేదముస్లింలకు ఇచ్చారా అన్నారు. మేం వాస్తవాలు మాట్లాడుతుంటే వక్ఫ్‌ఆస్తుల్లో హిందువుల జోక్యమా అంటూ మాట్లాడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రాను ఏర్పాటు చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వక్ఫ్ ఆస్తులపై విచారణ జరిపించే దమ్ముందా అని ప్రశ్నించారు. ఎన్ని భూములు ఆక్రమణకు గురయ్యాయి, ఒవైసీ కుటుంబం ఎంత దోచుకుంది, వక్ఫ్ ఆస్తులపై ఎంత ఆదాయం వస్తోంది, పేదల సంక్షేమానికి ఎంత ఖర్చు చేశారనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, మాజీ ఎంపీ వెంకటేష్‌నేత, పెద్దపల్లి, ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణారెడ్డి, చింతల రామచంద్రా రెడ్డి, నాయకులు పల్లె సదానందం, కందుల సంధ్యారాణి, ఠాకూర్ రాంసింగ్, పర్శ సమ్మయ్య, బెజ్జంకి దిలీప్‌కుమార్, శివంగారి సతీష్, నర్సింగం, జంగా చక్రధర్ రెడ్డి, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి సంజయ్

చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నిద్రిస్తున్న మహిళ మెడలోని చైన్‌ను కిటికీ నుంచి అపహరించిన దొంగను 12గంటల వ్యవధిలోనే రామకృష్ణాపూర్ పోలీసులు ఛేదించి పట్టుకున్నారు. ఆదివారం రామకృష్ణాపూర్ పోలీసుస్టేషన్ బెల్లం పల్లి ఏసీపీ రవికుమార్ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన ఇరుముల్ల శరణ్య కిటికీ పక్కన నిద్రిస్తున్న సమయంలో మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు, అదేవిధంగా బుర్ర రాజేంద్రప్రసాద్ అనేవ్యక్తి మొబైల్ ఫోన్‌ను కిటికీలో నుంచి అపహరించి పారిపోయాడు. సంఘటనపై బాధితులు పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసుకున్నారు. పోలీసులు బృందాలుగా ఏర్పడి సీసీ కెమెరాలను పరీక్షించగా నిందితుడు గుంజ ఇమాన్యుల్‌గా తేలింది. వెంటనే గోదావరిఖని కాకతీయ కాలనీ పరిసర ప్రాం తాల్లో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా సింగరేణి ఏరియా ఆసుపత్రి చౌరస్తా వద్ద బైక్‌మీద వెళ్తున్న నిందితుడిని తనిఖీ చేశారు. అతని జేబులో సుమారు మూడుతులాల పుస్తెలతాడు, ఒక మొబైల్‌ఫోన్ దొరకడంతో నిందితుడిని అదుపులోకి తీసు కున్నారు. నేరస్తుడు గుంజ ఇమాన్యుల్ గోదావరిఖని కాకతీయ కాలనీకి చెందినవాడు. గతంలో పలు చోరీ కేసుల్లో అరెస్ట్ అయి ఇటీవల విడుదలయ్యాడు. మళ్లీ దొంగతనం చేస్తూ పోలీసులకు పట్టుబడినట్టు ఏసీపీ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, రామకృష్ణాపూర్ ఎస్‌ఐ రాజశేఖర్, కాసిపేట ఎస్‌ఐ ప్రవీణ్, క్రైం టీం సిబ్బందికి సీపీ అభినందించి వారికి రివార్డు అందజేశారు.

కారును ఢీకొన్న లారీ

- తొమ్మిది మందికి గాయాలు

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం పొలాస శివారులో ఆదివారం ఎర్టీగా కారును లారీ ఢీకొనడంతో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్ జిల్లా దివాల్‌పూర్ గ్రామానికి చెందిన విస్తాపురం భూమేష్, కోడె మధు, శ్రీరాం, మున్నా, ప్రణీత, రిషి, విశ్వనాథ్, నర్సయ్య, మరో వ్యక్తి కారులో ధర్మపురి దైవ దర్శనానికి వెళ్లి తిరిగి జగిత్యాల వైపు వస్తుండగా లారీ వేగంగా ఢీకొట్టింది. దీంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలు కాగా మరో ఐదుగురికి స్వల్పంగా గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. క్షతగాత్రుడు కదం శ్రీరాం ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ మృతి



సంధ్య (ఫైల్)

హుజూరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని కుమ్మరివాడకు చెందిన గన్నారపు సంధ్య (33) అనే అంగన్‌వాడీ టీచర్ అనారోగ్యంతో మృతిచెందింది. సంధ్య కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. హనుమకొండలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. సంధ్యమృతిపట్ల సీడీపీవో సుగుణ, సూపర్‌వైజర్లు పద్మ, రాజశ్రీ, శిరీష, రమాదేవి, స్వరూప, జ్యోతి, శ్యామల, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

అప్పుల బాధతో గీత కార్మికుడి ఆత్మహత్య



తిరుపతి (ఫైల్)

ఓదెల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఓదెల మండలం పొత్కపల్లికి చెందిన సూదగోని తిరుపతి గౌడ్ (50) అనే గీత కార్మికుడు శనివారం రాత్రి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామగుండం జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం పొత్కపల్లికి చెందిన తిరుపతి గౌడ్ ఏడేళ్ల క్రితం హైదరాబాద్ వెళ్ళి ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. కూతురు వివాహానికి అప్పులు చేసి తిరిగి చెల్లించలేక మానసిక ఇబ్బందులతో మనస్తాపం చెంది పొత్కపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రమాదేవి ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పొలంలో ట్రాక్టర్ ఢీకొని రైతు మృతి



రాజిరెడ్డి(ఫైల్)

ఓదెల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లిలో ఆదివారం వరిపంట కోయించేందుకు వెళ్లిన ఎడవెల్లి రాజిరెడ్డి(80) అనేరైతు ట్రాక్టర్‌ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. వరిపంటను హార్వెస్టర్‌తో కోయించేందుకు వెళ్లగా డ్రైవింగ్‌లో అనుభవంలేని వ్యక్తిట్రాక్టర్‌ను వెనకకు తీయడంతో రాజిరెడ్డి ట్రాక్టర్ కిందపడి నలిగి మృతిచెందాడు. పొత్కపల్లి ఎస్సై రమేష్ నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదు. మృతుడికిభార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం ఎస్‌ఐ రమేష్ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి మృతి

- భువనగిరి జిల్లాలో ఘటన
- మృతుడు మామిడిపల్లివాసిగా గుర్తింపు

కోనరావుపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన మండలంలోని మామిడిపల్లికి చెందిన తీపిరెడ్డి సుదర్శన్‌రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలోని పొడిచేడు గ్రామంలో మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పొడిచేడు గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మామిడిపల్లికి చెందిన తీపిరెడ్డి సుదర్శన్‌రెడ్డి(40) కొంతకాలంగా తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలోనే భార్యాపిల్లలను వదిలేసి ఎక్కడికి పడితే అక్కడికి వెళ్లడం అలవాటుగా మారింది. అదేక్రమంలో శనివారం రాత్రి పొడిచేడు వద్ద బస్సు దిగి బస్‌స్టాప్‌లో పడుకున్నాడు. అపరిచిత వ్యక్తి బస్ షెల్టర్‌లో తచ్చాడుతున్న విషయాన్ని గమనించి ఆరా తీయగా మద్యం మత్తులో ఉన్న వ్యక్తి సరైన సమాధానాలు చెప్పలేదు. ఉదయం గ్రామస్థులు అతడి దగ్గరకు వెళ్లి చూడగా చనిపోయినట్లు నిర్ధారించుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు వచ్చి అతని సెల్‌ఫోన్ ద్వారా అతనికి సంబంధించిన సమాచారాన్ని వాకబు చేశారు. భార్య, బంధువుల కోరిక మేరకు మృతదేహాన్ని రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచి కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మోత్కూర్ పోలీసులు తెలిపారు.

కర్రలే విద్యుత్ స్తంభాలు



మారేడుపల్లిలో కర్రలపై విద్యుత్ తీగలు

ఎండపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి మండలంలోని మారేడుపల్లి గ్రామంలో కర్రలే విద్యుత్ స్తంభాలుగా మారాయి. ప్రమాదమని తెలిసినా విద్యుత్అధికారులు పట్టించుకోవడం లేదు. ఈదురుగాలులకు కర్రలు కింద పడే అవకాశం ఉంది. కోత సమయంలో, పొలం నాటు సమయంలో దీనివల్ల ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

రేపు బీఎస్ఎన్ఎల్ క్లస్టర్ సర్వీస్ క్యాంపులు

భగత్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఆధ్వర్యంలో మంగళవారం క్లస్టర్ సర్వీస్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) పొన్నం అజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. కస్టమర్లకు వారి సమస్యలపై తక్షణమే పరిష్కారాన్ని చూపిస్తామన్నారు. మంగళవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నాలుగు ప్రాంతాల్లో టెలిఫోన్ భవన్ కరీంనగర్, టెలిఫోన్ ఎక్ఛేంజి జగిత్యాల, టెలిఫోన్ ఎక్ఛేంజి హుజూరాబాద్, టెలిఫోన్‌ఎక్ఛేంజి గోదావరిఖనిలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు సర్వీస్ క్యాంపులు ఉంటాయన్నారు. ఈఅవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకుని సంస్థకు విలువైన అభిప్రాయాలు అందించి మెరుగైన సేవలకు తోడ్పడాలని కోరారు.

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జగిత్యాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాల్లో కురిసిన అకాల వర్షాలు, ఈదురుగాలులతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. చేతికి వచ్చిన వరి, మామిడి పంటలకు తీరనినష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో నిల్వచేసిన ధాన్యం పూర్తిగా తడిచిపోయిందని తెలిపారు. కోతకు సిద్ధంగా ఉన్న మామిడికాయలు రాలి రైతులకు పెనునష్టం వాటిల్లిందన్నారు. ఒక్క కోరుట్ల నియోజకవర్గంలోనే 12వేల ఎకరాల్లో వరి, మామిడి, మొక్కజొన్న, నువ్వులు, సజ్జపంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలంలో 6వేలఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని వివరించారు. అలాగే జగిత్యాల జిల్లాలోని మిగతా మండలాల్లోనూ పంట నష్టంవాటిల్లిందని, అకాల వర్షాలు, ఈదురు గాలులకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



పారాహుషార్

- వేసవిలో అధికంగా చోరీలు
- ఇంటికి తాళం కనపడితే దొంగతనం
- అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులంటే పిల్లలతోపాటు తల్లిదండ్రులకు కొంత వెసులు బాటు. స్వగ్రామాలకు వెళ్లడంతోపాటు విహార యాత్రలు, పుణ్యక్షేత్రాల సందర్శనకు వేసవి సెలవు ల్లోనే అవకాశం లభిస్తుంది. ఇదే అదునుగా భావించి దొంగలు ఎక్కువగా చోరీలకు పాల్పడతారు. ఇటీవల కాలంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. పదిహేను రోజుల కిందట రెండు రోజుల వ్యవధిలో 12 ఇళ్లలోనూ, ఒక మిర్చియార్డులోనూ చొరబడిన దొంగలు లక్షల రూపాయల సొత్తును లూటీ చేశారు. శంకరపట్నం మండలం లింగాపూర్‌లో తాళాలు పగులగొట్టి ఎనిమిది ఇళ్లలో భారీగా బంగారం, వెండి ఆభరణాలతోపాటు నగదు, బైక్ ఇతర విలు వైన వస్తువులను ఎత్తుకెళ్లారు. ఒకరోజు విరామం ఇచ్చిన దొంగలు మానకొండూర్ మండలం అన్నారం గ్రామంలో నాలుగు ఇళ్లలో చొరబడి బంగారం, వెండి, నగదు, బైక్‌లను చోరీ చేశారు.

తాజాగా నగరంలోని సప్తగిరి కాలనీలో మెస్‌డోర్‌లు మాత్రమే బిగించిన ఒక ఇంటిలో అదనుచూసి భారీగా బంగారం, నగదు దొంగి లించుకుపోయారు. పట్టణాల్లో పగటి పూట రెక్కీ నిర్వహిస్తూ టార్గెట్‌గా చేసుకున్న ఇళ్ల వద్ద పరిసరాలను పూర్తిగా అవగాహన చేసుకుంటున్నారు. అర్ధరాత్రి సమ యాల్లో అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఇళ్లల్లోకి చొర బడి చోరీకి పాల్పడుతున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఇళ్లకు తాలం వేసి వ్యవసాయ పనులకు వెళ్లడంతో పగటి పూటనే ఇళ్లు లూటీ చేస్తున్నారు. ఒక వైపు బ్లూకోల్ట్స్ పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగానే మరో వైపు దొంగలు చోరీలకు పాల్పడుతుండడం ఆందోళనకు గురి చేస్తోంది. దొంగతనాలు జరిగిన తరువాత పోలీసులు విచారణ చేపట్టి సీసీ కెమెరాలు, వేలిముద్రల ఆధారంగా దొంగలను అరెస్టు చేస్తున్నా బాధితుల సొమ్ము పూర్తిగా రికవరీ కావడం లేదు. కొన్ని సంఘ టనల్లో దొంగలు వేలి ముద్రలు పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు, చేతికి టవల్ కట్టుకొని తలుపులు, బీరువాలు తెరుస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

ప్రజలు కూడా సరైన భద్రతా చర్యలు తీసుకోవడం లేదని, దొంగతనాలను అరికట్టడంలో పోలీసులకు సరైన విధంగా సహకారం అందివ్వడం లేదని పోలీసులు పేర్కొంటున్నారు. దొంగతనాల నియంత్రణకు కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవాలని కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి ఒక ప్రకటనలో కోరారు.



తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వేసవికాలంలో రాత్రిపూట ప్రజలు వీలైనంత వరకు ఇంట్లోనే నిద్రించేలా చూసుకోవాలి.
- ఆరుబయట నిద్రిస్తే ఇంటి ప్రధాన తలుపు, ఇతర కిటికీలు గట్టిగా మూసి ఉన్నాయని, గొళ్లెం వేసి ఉందని నిర్ధారించుకోవాలి.
- నగలు, డబ్బు, ఇతర విలువైన వస్తువులను ఇంటిలో సురక్షితమైన స్థలంలో లేదా లాకర్‌లో ఉంచాలి.
- రాత్రిపూట ఇంటి పరిసరాల్లో లైట్లు వెలుగుతూ ఉండేలా చూసుకోవాలి. ఇంట్లో మనుషులు ఉన్నట్లు ద్వారాల వద్ద చెప్పులు ఉంచాలి.
- చీకటి ప్రదేశాలు దొంగలకు అనువుగా ఉంటాయి. ముఖ్యంగా కదలికలను గుర్తించే సెన్సార్‌లైట్లు ఏర్పాటు చేసుకోవడం మంచిది.
- రాత్రిపూట గేట్లు మూసి ఉన్నాయని నిర్ధారించుకోవాలి.
- ఇంటికి తాళం వేసినట్లు కనిపించకుండా కర్టెన్‌ను చాటుగా ఉంచాలి.
- అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఇంటి పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను గమనిస్తే వెంటనే సమీపంలోని పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలి.
- ఒకే చోట ఎక్కువ మంది గుంపుగా నిద్రపోవడం దొంగలకు సులువుగా ఉంటుంది, వీలైతే వేర్వేరు ప్రదేశాల్లో నిద్రించాలి.
- దొంగతనం జరిగితే, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.
- ఇరుగుపొరుగు వారితో సత్సంబంధాలు కలిగి ఉండాలి. ఒకరినొకరు సహకారం తీసుకోవాలి. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తేఒకరికొకరు తెలియజేసుకోవాలి.
- ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. దీంతో దొంగలను గుర్తించడం, పట్టుకోవడం సులభమవుతుంది.
- ఈ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వేసవిలో దొంగతనాలను నివారించవచ్చు.

ఆపద్బాంధవుడు..

- రక్తదానంలో ఎల్లారెడ్డిపేట యువకుడి ఆదర్శం
- యాభైసార్లు పూర్తి.. పలువురి ప్రశంసలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఆపద సమయంలో రక్తం లభించక నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోవడాన్ని చూసి ఆ యువకుడు తట్టుకోలేకపోయాడు. రక్తలేమితో బాధపడుతున్న రోగులకు రక్తదానం చేస్తున్నాడు. ఇప్పటివరకు 50 సార్లు రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన యువకుడు వంగ గిరిధర్‌రెడ్డి.



రక్తదానం చేస్తున్న గిరిధర్‌రెడ్డి

పది అవార్డులు..

రక్తలేమి, శస్త్రచికిత్స సమయంలో రక్తం లభించక ప్రాణాలు కోల్పోతున్న వారిని చూసి మండల కేంద్రంలోని వంగ గిరిధర్‌రెడ్డి చలించిపోయాడు. 2000 సంవత్సరంలో హైదరాబాద్‌లో గాంధీ జయంతిని పురస్కరించుకుని మొదటిసారి రక్తదానం చేశాడు. 2005లో స్థానికంగా సహాయ స్వచ్ఛంద సంస్థను నెలకొల్పాడు. ఇప్పటివరకు 50 సార్లు రక్తదానం చేసి వివిధ స్థాయిల్లో 10 అవార్డులు అందుకున్నాడు. రక్తదానం సేవలను విస్తరింపజేసేందుకు తన సంస్థ ద్వారా యువకులకు అవగాహన కల్పిస్తున్నాడు.

మిత్రులు, బంధువులను ప్రోత్సహిస్తున్నాను..

గిరిధర్‌రెడ్డి

రక్తదానం విషయంలో ప్రతిఒక్కరూ అపోహలు వీడాలి. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడటం మన బాధ్యత. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలి. ఆరోగ్యంగా ఉన్న 18 నుంచి 65 ఏళ్లలోపు రక్తదానం చేయవచ్చు. నా ఆరోగ్యం సహకరించే వరకు రక్తదానం చేస్తా. మిత్రులు, బంధువులకు అవగాహన కల్పించి ప్రోత్సహిస్తున్నాను.





సినీ నటుడు పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా, బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, సినీ నటుడు చిరంజీవి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న గిరిధర్‌రెడ్డి (ఫైల్)

యువకుడి కిడ్నాప్ కలకలం

- రూ.7లక్షలు డిమాండ్
- తండ్రి దగ్గర డబ్బు వసూలుకు కుమారుడి నాటకం?
- సికింద్రాబాద్‌లో పట్టుకున్న పోలీసులు



లక్ష్మీరాజం

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కోరుట్లరూరల్ మండలం గుమ్లాపూర్‌లో మందలక్ష్మీరాజం(23) అనే యువకుడి కిడ్నాప్‌కలకలం సృష్టించింది. బాధిత కుటుంబ సభ్యులుతెలిపిన వివరాలప్రకారం.. గుమ్లాపూర్ గ్రామానికి చెందిన మంద గంగారాజం కుమారుడు మంద లక్ష్మీరాజం ఈనెల 19వ తేదీన తనఫోన్‌తోపాటు తండ్రి ఫోన్‌ను పట్టుకొని ఇంటినుంచి ద్విచక్రవాహనంపై బయటకువెళ్లాడు. ఈక్రమంలో 19న లక్ష్మీరాజం ఫోన్ నుంచి అతడి చిన్నాన్న మంద వెంకటికి తన అన్నకుమారుడిని కిడ్నాప్ చేస్తున్నామని రూ.7 లక్షలు కావాలని డిమాండ్‌చేశారు. ఆ విషయాన్ని వెంకటి తన అన్న గంగారాజంకు చేరవేశాడు. గంగారాజం తనఫోన్ గురించి ఇంట్లో వెతగ్గా దొరక్కపోవడంతోపాటు తన కుమారుడు ఇప్పటివరకు ఇంటికి రాలేదని వెతకడం ప్రారంభించాడు. చివరికి లక్ష్మీరాజం ద్విచక్ర వాహనం కోరుట్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఉండడం గమనించారు. ఆదివారం ఉదయం మరో నంబర్ నుంచి చిన్నాన్న వెంకటికి మరోమారు మెసేజ్ వచ్చింది. ప్రస్తుతం రూ.30వేలు పంపాలని సాయంత్రం వరకు మిగతా డబ్బులు జమ చేయాలని లేకుంటే మీ కుమారుడిని చంపివేస్తామని మెసేజ్ చేశారు. దీంతో ఇద్దరు అన్నదమ్ములు మెస్సేజ్ వచ్చిన నంబర్‌కు రూ.30వేలు జమ చేసి పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేసి గంగారాజం, లక్ష్మీరాజం ఫోన్ నంబర్ల లోకేషన్ పరిశీలించగా సికింద్రాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. దీంతో కోరుట్ల ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకొని విచారణ చేపట్టారు. ఆదివారం రాత్రి లక్ష్మీరాజం ఓలాడ్జిలో ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నారు. కాగా లక్ష్మీరాజం వెంబడి ఎవరూ కిడ్నాపర్లు లేకపోవడంతో తండ్రి వద్ద డబ్బులు వసూలు చేయడానికి కిడ్నాప్ డ్రామా ఆడినట్లుగా తెలుస్తోంది. లక్ష్మీరాజంను పోలీసులు కోరుట్లకు తీసుకువచ్చారు. కిడ్నాప్‌నకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడి కానున్నాయి.

భక్త జనసంద్రంగా రాజన్న ఆలయం

- స్వామివారి దర్శనానికి రెండు గంటల సమయం



రాజన్న దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



గణేష్‌వద్ద పూజలో పాల్గొన్న ఆది శ్రీనివాస్–వనజ దంపతులు

వేములవాడ టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయం భక్తజన సంద్రంగా మారింది. ఆదివారం సెలవు రోజు కావడంతో వేములవాడకు భక్తులు భారీగా తరలివచ్చారు. రాజన్న ఆలయానికి తరలివచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. ఉదయం భక్తులు కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. ధర్మదర్శనం, కోడెమొక్కు క్యూలైన్‌లో భక్తులు సుమారుగా రెండుగంటలపాటు బారులు తీరారు. శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని తరించారు. అనంతరం రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవోవినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవోలు, సూపరింటెంట్‌లు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రాజన్న సేవలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దంపతులు..

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దంపతులు ఆదివారం దర్శించుకు న్నారు. ఆది శ్రీనివాస్ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రాజన్నదర్శనానికి వచ్చారు. ఆలయఅర్చకులు వారికి ఘన స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

వరి కొయ్యలను కాల్చితే.. నష్టమే

- కాలుష్యం పెరుగుతుంది
- భూమిలోని పోషకాలపై తీవ్ర ప్రభావం
- భూమిలో కలియదున్నితే పంటలకు ఎంతో మేలు



చొప్పదండి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రైతులు.. సాధారణంగా వరి పంట కోసిన తరువాత కొయ్యలను కాల్చివేస్తారు. అలా వరికొయ్యలను కాల్చితే భూమిలోని పోషకాలపై తీవ్రప్రభావం చూపుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. భూమిలోని పోషకాలు తగ్గి దిగుబడి పడిపోయి పంటకు మేలుచేసే పోషకాలు దెబ్బతింటాయి. ముఖ్యంగా నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాషియం అవిరైభవిష్యత్తులో పంటల దిగుబడిపై ప్రభావం చ ా షు తాం ౧౧. వాయుకాలుష్యం వల్ల రైతు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంటుంది. వరికొయ్యలను కాల్చ కుండా పొలంలోనే కలియ దున్నితే భూ సారం పెరిగి దిగుబడి పెరుగుతుంది. గతంలో రైతులు పంటల అవశేషాలను, చెత్తా చెదారం, పత్తికట్టె, వరి కొయ్యలను తగులబెట్టకుండా భూమిలోనే దున్నేవారు. ప్రస్తుతం వరికోత యంత్రాల ద్వారా కోస్తుండడంతో కొయ్య పొడవుగా ఉండడం చేత మురగడానికి సమయం పడుతుం దని రైతులు కాల్చి వేయడానికే మొగ్గు చూపుతున్నారు. దీంతో ఎరువులు చల్లినా సరైన పంట దిగుబడి రావడం లేదు. రైతులు ఏటా వరి కొయ్యలను తగల బెడుతుండగా వర్యావరణం, వాతావరణంలో మార్పులు వస్తున్నాయి.

వరికొయ్యలకు నిప్పు పెట్టడంతో కలిగే నష్టాలు..

వరికొయ్యలను కాల్చడంతో వాయుకాలుష్యం పెరుగుతుంది. వాతావరణ కాలుష్యం పెరిగి విపరీతమైన వేడితో పంట భూమి సారాన్ని కల్పోతుంది. నత్రజని, ఫాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గి పంటదిగుబడి తగ్గిపోతుంది. భూమికి పీచుపదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి. పొలానికి మేలుచేసే క్రిమికీటకాలు నశించి భూసారం తగ్గిపోతుంది. వానపాములు(ఎర్రలు), అనేక జీవరాశులు చనిపోయే ప్రమాదం ఉంది. ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది. గట్లు, మొరం గడ్డలపై ఉన్న పచ్చనిచెట్లు కూడా ఒక్కోసారి కాలిపోతాయి. అగ్నిప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుంది.

భూసారం పెంపునకు దోహదం

వరికొయ్యలను నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ కర్బన శాతం పెరిగి పంట దిగుబడులు 5నుంచి 10 శాతం పెరిగే అవకాశముంది. నేలలో గడ్డిని కలియదు న్నడం వల్ల సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుం ది. భూ సారంతోపాటు దిగుబడులు పెరిగి రైతులకు మేలు జరుగుతుంది. దుక్కి దున్నే సమయంలో సూపర్ ఫాస్ఫేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి, పోషకాలుగా మారి డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది. కొయ్యలను దున్నడం వల్ల ఎకరాకు దాదాపుగా టన్ను ఎరువు తయారవు తుంది. జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం లాంటి సూక్ష్మ దాతువులు పంటకు మేలు చేకూర్చుతాయి. నేలలో కరగని మూలకాలను అనుకూలంగా మార్చుతుంది. నీటి నిల్వ పెరుగుతుంది. కొయ్య కాళ్లను భూమిలో కలియ దున్నితే, గడ్డి ద్వారా పోషకాలన్నీ తిరిగి నేలకు చేరుతాయి.

వరికొయ్యలను కాల్చవద్దు: వంశీకృష్ణ, ఏవో, చొప్పదండి



వరిపంటలో కొయ్యకాలు కాల్చడం వలన భూమిలో ఉన్న పంటకు మేలు చేసే సూక్ష్మ జీవులు చనిపోతాయి. పంటకు అందవల్సిన పోషకాలు అందకుండా నత్రజని, భాస్వరం, పొటాషియం లాంటి పోషకాలు తగ్గి భూమి యొక్క నెల నిర్మాణం చెదిరి పోతుంది. సేంద్రియ కార్బన్ తగ్గిపోయి పంట దిగుబడి తగిపోతుంది. వాయు కాలుష్యం పెరగడంతో వాతావరణంలో మార్పులు వస్తాయి. రైతులు వరికొయ్యలు కాల్చే బదులు రోటరీ మాల్చర్ ద్వారా పొలాన్ని దున్ని, ఎకరానికి 100కిలోల సూపర్ ఫాస్పేట్ చల్లుకోవడం ద్వారా కొయ్యకాలు మురిగి పంట దిగుబడి పెరుగుతుంది.

ఉమ్మడిజిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలకు స్పందన

- 250 మంది క్రీడాకారుల హాజరు



హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికల్లో పోటీపడుతున్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడిజిల్లా హ్యాండ్‌బాల్‌జట్ల ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లాకేంద్రానికి సమీపంలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ మైదానంలో ఆదివారం నిర్వహించిన ఈ పోటీలకు ఉమ్మడిజిల్లాలోని వివిధప్రాంతాల నుంచి 250మందిక్రీడాకారులు హాజరయ్యారు. వీరినుంచి సీనియర్ మహిళల ఎంపిక పోటీలతోపాటు సౌత్‌జోన్ పురుషుల, మహిళల ఎంపికపోటీలను కూడా నిర్వహించారు. ఈ ఎంపికపోటీల్లో ప్రతిభచాటిన ఉమ్మడి జిల్లాజట్లకుఎంపికైన క్రీడాకారులు ఈనెల29 నుంచి 30వరకు ఆదిలాబాద్ జిల్లా మంద మర్రిలో జరిగే 54వరాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారు. అంతకుముందు కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ యాదగిరి సుజిత్‌రావు ముఖ్య అతిథిగా హాజరైపోటీలను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర స్థాయిపోటీల్లో జిల్లాక్రీడాకారులు విశేష ప్రతిభచాటి చాంపియన్లుగా నిలిచేందుకు కృషిచేయాలన్నారు. క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని, నిత్య జీవితంలో క్రీడలను ఒకభాగంగా చేసుకోవాలని సూచించారు. ఈపోటీలను జిల్లాహ్యాండ్ బాల్‌అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్లవెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ పర్యవేక్షించారు. పోటీల నిర్వహణలో సంఘ సంయుక్తకార్యదర్శి నమిలకొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్, దాసరి మల్లేష్, పెద్దపల్లి జిల్లా బాధ్యుడు సురేందర్, సిరిసిల్ల జిల్లాబాధ్యుడు కృష్ణహరి, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, తిరుమలేష్, విజయ్, సూర్య, అమర్‌సాయి, శివాజీ, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

సన్మానం

భగత్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జేరిపోతుల వాసును కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పొన్నం సత్యంగౌడ్ సన్మానించారు. కార్యక్రమంలో రాచకొండ ప్రభాకర్, కొత్తపల్లి మాజీ సర్పంచ్ కనకరెడ్డి పాల్గొన్నారు.

బొట్టుపెట్టి ఆహ్వానం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ సభకు రావాలని కోరుతూ బీఆర్ఎస్ మహిళా నాయకులు సుల్తానా సావనపల్లి నారాయణమ్మ, సిరిపురం లావణ్య ఇంటింటికి వెళ్లి మహిళలకు బొట్టు పెట్టి ఆహ్వానించారు. ఈ నెల 27న ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవాలకు రావాలని నగరంలోని కిసాన్‌నగర్‌లో మహిళలను ఆహ్వానించారు.

బధిరుల ఆశ్రమ పాఠశాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు రేకుర్తిలో గల బధిరుల ఆశ్రమ పాఠశాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని హ్యూమన్ రైట్స్ మొగిలి సతీష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలలో కొంతమంది ఉద్యోగస్తులు రిజిస్టర్‌లో సంతకాలు పెట్టి ఉద్యోగాలకు రావడం లేదన్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుర్శేడ్‌కు చెందిన ఈర్నాల లక్ష్మి, జాడి తిరుపతి అనే ఇద్దరు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బుర్ర హరీ ష్‌గౌడ్ ఆదివారం అందజేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, మాజీసర్పంచ్ గాజుల అంజయ్య, రూరల్ ఉపాధ్యక్షుడు పాలకుర్తి లక్ష్మణ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ పాల్గొన్నారు.

ప్రైవేట్ పీఈటీల సంఘం కార్యవర్గం

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యవర్గాన్ని ఆదివారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా బత్తిని శ్రీధర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా గౌతమ్‌రెడ్డి, కోశాధికారిగా కంకటి అనూప్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ప్రైవేట్ వ్యాయామ విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాణిజ్యపన్నుల శాఖ రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సమావేశం నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ హాజరై మాట్లాడారు. సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్ శ్రీనివాస్, మాజీ సీటీవో రామస్వామి, జగన్మోహన్‌రెడ్డి, జి బిక్షపతి, ఎస్ ప్రభాకర్, హనుమంతు, రాజ్‌మహ్మద్, సలీం, రాజేంద్ర ప్రకాశ్, అమరేందర్, కృష్ణమూర్తి, భగవాన్ రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్/కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎల్లప్పుడూ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌లో, తీగలగుట్టపల్లి, చామన్‌పల్లి, దుబ్బపల్లిలో ఆదివారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్లప్పుడూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులు దోపిడీకి గురయ్యారని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్ ఇచ్చి రైతులకు అండగా నిలిచిందని, రుణమాఫీ చేసి చూపించిందని, రైతు భరోసా ఇచ్చిందని నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమాలలో నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, మూల రవీందర్ రెడ్డి, ఆకారపు భాస్కర్‌రెడ్డి, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, కాశెట్టి శ్రీనివాస్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, కొలగాని అనిల్, కొలగాని శ్రీనివాస్, అట్టేపు వేణు, కిరణ్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, దీకొండ శంకరయ్య, జగ్గని కనుకయ్య, సీపీ మమత, పెద్దిగారి తిరుపతి, కాంపెల్లి కీర్తికుమార్, గంగుల దిలీప్, లింగంపల్లి మంగ, బుర్ర గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం ఎలబోతారం, ఫకీర్‌పేట గ్రామాల్లో మహిళ సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం భార్గవ్, వీవోలు సుద్దాల రాధమ్మ, వాసాల సౌమ్య, ఏపీఎంలు, సీసీలు, వీవోలు, రైతులు పాల్గొన్నారు.

గంగాధర: మండలంలోని మంగపేట, చర్లపల్లి, కోట్లనర్సింహులపల్లి,నాగిరెడ్డిపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలుకేంద్రాలను సింగిల్‌విండో చైర్మన్ దూలం బాలగౌడ్‌తో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు వేముల భాస్కర్, మాజీసర్పంచ్ తోటమల్లారెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, పురమల్ల మనోహర్, రైతులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని మర్రివానిపల్లె, గడ్డివానిపల్లె, టేకుర్తి గ్రామాల్లో ఏర్పాటుచేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీఎం రమాదేవి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కళ్లెం సత్యనారాయణరెడ్డి, డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, సంఘం అధ్యక్షురాళ్లు శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని కాట్నపల్లి, సాంబయ్యపల్లె, గుమ్లాపూర్, మంగళపల్లి గ్రామాల్లో ఐకేపీ, ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్‌చైర్మన్ కొత్తూరు మహేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో కొండగట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ వైస్‌చైర్మన్ మునిగాల రాజేందర్, డైరెక్టర్లు చుప్ప శ్రీనివాస్, కొత్తపల్లి నవీన్, రైతులు పాల్గొన్నారు.

● చొప్పదండి వ్యవసాయ మార్కెట్ పక్కన ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌స్థలాన్ని ధాన్యం కొనుగోళ్లకు కేటాయించాలని మార్కెట్ చైర్మన్ కొత్తూరు మహేష్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కోరగా కలెక్టర్‌తో మాట్లాడి స్థలాన్ని కేటాయించారు.



దుబ్బపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కొమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కోట్ల నర్సింహులపల్లిలో..

యువత బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలి: ఎమ్మెల్యే

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): యువత బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. యువజన కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ గుర్రం వాసు, ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి శ్రీకాంత్ ఆధ్వర్యంలో 'సే నో టూ బెట్టింగ్ సేవ్ లైఫ్' అనే నినాదంతో ఆదివారం 2కె రన్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై మాట్లాడారు. చాలామంది యువకులు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బలై ప్రాణాలు పోగొట్టుకోవడం తీవ్రమైన బాధకు గురి చేసిందన్నారు. సమాజంలో బెట్టింగ్ అనేది ఒక ప్రమాదకరమైన వ్యసనంగా మారిందన్నారు. యువత బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అంతకుముందు కార్యక్రమాన్ని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ రన్ నగరంలోని మార్క్‌ఫెడ్ గ్రౌండ్ నుంచి తెలంగాణ చౌక్ వరకు కొనసాగింది. మొదటి బహుమతి గెల్చుకున్న వినయ్‌కి 10 వేలు, రెండవ బహుమతి రణధీర్‌కు 5 వేలు, మూడవ బహుమతి సంజీవ్‌కు 3 వేల రూపాయల నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కిమ్ ఫహద్, ప్రధాన కార్యదర్శి బత్తిని విష్ణు, అజీమ్, అసెంబ్లీ ఉపాధ్యక్షులు అఖిల్, మానకొండూర్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ తొర్తి అరవింద్, కరీంనగర్ టౌన్ ఉపాధ్యక్షులు బుర్ర రాహుల్, మానకొండూర్ మండల ఉపాధ్యక్షులు ముక్కెర సతీష్ పాల్గొన్నారు.



2కె రన్ విజేతలతో అతిథులు

మెడికల్ షాపు నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్ర జ్యోతి): నకిలీ మందులు విక్రయిస్తున్న మెడికల్ షాపుల నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ షాపులపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో నకిలి మందులను అమ్ముతున్నారని ఆరోపించారు.

రిజర్వేషన్లు తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర

భగత్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీనవర్గాల రిజర్వేషన్లను తొలగించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ అన్నారు. కొత్తపల్లి పట్టణంలో భారత రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీని ఆదివారం చేపట్టారు. కార్యక్రమంలో కొత్తపల్లి టౌన్ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, కొత్తపల్లి మండల కో-ఆర్డినేటర్ కర్ర సత్యప్రసన్నరెడ్డి, మండల అధ్యక్షుడు స్వామిగౌడ్ పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నివాళి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): టీపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు కె రమణకు టీపీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. కరీంనగర్ జిల్లా శాఖ కార్యాలయంలో సంతాప సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంకె రామచంద్రారెడ్డి, వేల్పుల బాలయ్య, జిల్లా కార్యదర్శులు శ్రీనివాస్, లక్ష్మీరాజం, కొమురెల్లి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా భాస్కర్


భాస్కర్‌కు నియామకపత్రాన్ని అందచేస్తున్న గజ్జెల కాంతం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా క్యాదాసి భాస్కర్‌ను నియమించి రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల కాంతం నియామక పత్రాన్ని అందచేశారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యాకర్తల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల కాంతం సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా కాద్యాసి ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జేరిపోతుల వాసు, ఉపాధ్యక్షులుగా నీరుకుల్ల అనిల్‌కుమార్, కొలిపాక స్వామి, తాండ్ర శంకర్, జక్కెనపల్లి శంకర్, తాటిపెల్లి జంపయ్య, ప్రధానకార్యదర్శులుగా చామనపల్లి చంద్రశేఖర్, మానాల నారాయణ, బొజ్జ రవి, తోడేటి వేణ, గుడిసె తిరుపతి, కోశాధికారిగా భీమారపు సతీష్, కార్య దర్శులుగా పొత్తూరి రమేశ్, గండి గణేష్, మీసాల సురేష్, అధికార ప్రతినిధిగా గడ్డం నాగరాజును నియమించారు.

'హస్త'వ్యస్తం

(5వ పేజీ తరువాయి)

కోరనున్నట్లు తెలిసింది. పార్టీ పదవులను సమన్వయంతో వ్యవహరించే వారికి ఇవ్వాలని వారు ప్రతిపాదించాలని సూత్రప్రాయంగా అభిప్రాయపడ్డారని సమాచారం. వారం, పది రోజుల్లో సుమారు యాభై మంది నేతలతో మరో సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిసింది. విస్తృతస్థాయిలో ఈ విషయాలపై చర్చించి ఒక సమగ్రమైన నివేదికను తయారు చేసి కరీంనగర్‌లో కాంగ్రెస్‌కు పునర్వైభవం తీసుకువచ్చేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని కోరుతూ అధిష్ఠానానికి సమర్పించాలని భావిస్తున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రిని, టీపీసీసీ అధ్యక్షుడిని, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జిని కలిసిన తర్వాత ఈ విషయాలపై చర్చించాలని, నివేదికను వారికి సమర్పించాలనుకుంటున్నట్లు తెలిసింది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ మరమ్మతులో భాగంగా సోమవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి 10 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు, ఏడీఈ లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనగర్ కాలనీ, భవానీ కాలనీ, సప్తగిరి కాలనీ, తాహెరా మసీద్ ప్రాంతం, అంజనాద్రి ఆలయ ప్రాంతం, దోబీఘాట్ ప్రాంతం, గోదామ్ ప్రాంతం, బీఎస్ఎఫ్ క్వార్టర్స్ ప్రాంతం, ఏవీఎస్, పార్క్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అగ్నిమాపకశాఖ సిబ్బందికి ప్రోత్సాహకాల అందజేత



మాట్లాడుతున్న డాక్టర్ రఘురామన్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపకశాఖ వారోత్సవాల ముగింపు సందర్భంగా కరీంనగర్ ఫైర్ స్టేషన్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రోత్సాహకాలను అందించారు. కరీంనగర్‌కు చెందిన దారం సుశీల ట్రస్ట్ తరఫున చైర్మన్, సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ రఘురామన్ జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి ఎం శ్రీనివాసరెడ్డి, కరీంనగర్ ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ రాజకుమార్ సమక్షంలో ఎంపికచేసిన పదిమంది సీనియర్ ఫైర్‌మన్లకు ట్రస్ట్ తరఫున ప్రోత్సాహకాలు అందజేశారు. అలాగే ఫైర్ స్టేషన్‌కు ఒక టేబుల్ ఫ్యాన్, రెండు కార్పెట్స్‌ను కూడా అందజేశారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రబాబు జన్మదినం


కేక్ కట్‌చేస్తున్న నాయకులు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ అడ్‌హక్ కమిటీ కన్వీనర్ వంచ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి దామెర సత్యం, మాజీ ఇన్‌చార్జి కళ్యాడపు ఆగయ్య, సందెబోయిన రాజేశం, తీగుట్ల రమేష్, రొడ్డ శ్రీధర్, రొడ్డ శ్రీనివాస్, నందాల శివశంకరప్రసాద్, తాటికొండ శేఖర్, లొంక భాస్కర్, హయగ్రీవాచారి, ఆకుల కాంతయ్య, ఎర్రవెల్లి వినీత్, ఇట్టె మల్లేశం, మేకల రాజమల్లు, జాన్ అబ్రహం, నారాయణ పాల్గొన్నారు.

● నగరంలోని సమాఖ్య కార్యాలయంలో రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

హుజూరాబాద్ (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని అంబేద్కర్ చౌరస్తావద్ద చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలను ఆదివారం టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంపి ణీ చేశారు. కార్యక్రమంలో ఎస్కే ఫయాజ్, వర్ధినేని లింగారావు, రామగిరి అంకూస్, శివ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):మండలంలోని చెల్పూర్ గ్రామంలో జిల్లా పరిషత్తు ఉన్నతపాఠశాలలో 1993-94బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారంజరిగింది. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులందరూ ఒకచోటచేరి చిన్ననాటి స్మృతులను గుర్తుచేసుకున్నారు. విద్యాబుద్ధులునేర్పిన గురువులను సత్కరించారు.

మల్లికార్జునస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

మానకొండూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లలితాపూర్ గ్రామంలో గల మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేకపూజలు చేశారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మల్లన్న పట్నాలను తిలకించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మర్రి ఓదెలు, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్‌రెడ్డి, యాదవ సంఘం అధ్యక్షుడు నల్లంగి ఐలయ్య, ఉపాధ్యక్షుడు మర్రి సదయ్య, ప్రధానకార్యదర్శి మారం ఐలయ్య, కార్యవర్గ సభ్యులు దాడి లింగయ్య, మర్రి కొమురయ్య, లచ్చయ్య, మల్లయ్య, సంపత్, భూమయ్య గ్రామస్థులు ఉన్నారు.

ఘనంగా బాలికల పాఠశాల వార్షికోత్సవం

చొప్పదండి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి బాలికల జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలుసాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో మండలవిద్యాధికారి శ్రీనివాస్ దీక్షితులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఇప్పనపల్లి సాంబయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మంజుల, ప్రధానోపాధ్యాయులు జంగం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి పుస్తె, మట్టెలు అందజేత

తిమ్మాపూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొలంపల్లి గ్రామంలో నిరుపేదలైన కొమ్మరాజుల సంపత్-లలిత దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్దకూతురుకు వివాహంజరుగగా, చిన్నకూతురు కవితకు వివాహం నిశ్చయం అయింది. అయితే పెళ్లి చేసేందుకు డబ్బులకు ఇబ్బంది పడుతుండగా స్థానిక మాజీఎంపీటీసీ, మండలకాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు బండారిరమేష్ స్పందించి జమ్మికుంటపట్టణానికి చెందిన ముక్క రాజలక్ష్య రమాదేవి దంపతులను సాయం చేయమని కోరారు. స్పందించిన వారుపెళ్లికి తమవంతుగా రూ.35వేలవిలువచేసే పుస్తెలు, మట్టెలుచేయించి ఆదివారం కొమ్మరాజుల సంపత్ కుటుంబానికి అందజేశారు.

ట్రాక్టర్ యూనియన్ కార్యవర్గం

గన్నేరువరం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన లక్ష్మీనరసింహస్వామి ట్రాక్టర్‌యూనియన్ నూతనకార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడుగా బోయిని కుమార్, ఉపాధ్యక్షుడిగా దుర్మట్ల కిట్టు, కోశాధికారిగా బత్తిని శేఖర్, ప్రధానకార్యదర్శిగా కాల్వ రమేష్, కార్యదర్శిగా బొడ్డు శ్రీనివాస్, కార్యవర్గసభ్యులుగా తిరుపతిరెడ్డి, గొల్లపల్లి రవి, అంజయ్య, బుర్ర మల్లేష్, నక్క దామోదర్, వెంకటేష్ తదితరులు ఎన్నికయ్యారు.

భక్తి శ్రద్ధలతో ఈస్టర్ పండుగ


ఎల్ఎండీలోని ఆల్‌సెయింట్ చర్చిలో జరిగిన ఈస్టర్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చర్చిల్లో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ పండుగను భక్తి, శ్రద్ధలతో జరుపుకున్నారు. ఎల్ఎండీ కాలనీలోగల సీఎస్ఐ ఆల్‌సెయింట్ చర్చిలో తెల్లవారుజామున 4.30 గంటలకు జరిగిన ప్రత్యేకప్రార్థనలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. ముందుగా చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన ఐమాస్‌లైట్లను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం చర్చిలో జరిగిన ఈస్టర్ వేడుకల్లో పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే డాక్టర్ వృత్తి నుంచి రాజకీయల్లోకి వచ్చినట్లు తెలిపారు. ఈస్టర్ పంటగా క్రైస్తవులకు అత్యంత పవిత్రమైనది అని అన్నారు. ప్రభువైన యేసుక్రీస్తు సిలువపై అర్పించిన త్యాగం తరువాత, మూడవ రోజున మరణాన్ని జయించి తిరిగి లేచిన మహత్తర ఘట్టాన్ని ఈస్టర్‌గా జరుపుకుంటారని తెలిపారు. అనంతరం పాస్టరేట్ చైర్మన్ రెడ్డిమల్లప్రసాద్ ఆధ్వర్యంలో చర్చిపెద్దలు కలిసి ఎమ్మెల్యేకవ్వంపల్లి సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. ప్రార్థన అనంతరం క్రైస్తవులం దరికీ ఈస్టర్ ఎగ్‌తో పాటు అల్పాహార విందు ఏర్పాటు చేశారు.

హుజూరాబాద్: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జాన్‌బాబు, సదానందం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సొల్లు బాబు, ప్రియాంక, చరణ్, రవీందర్, మహేందర్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ రూరల్: మండలంలోని రంగాపూర్ గ్రామంలోని కల్వరి చర్చిలో ఈస్టర్ డే వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చర్చిపాస్టర్ డాక్టర్ నెల్సన్ ఈస్టర్ డే ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. అన్నదానం, వస్త్రదాన కార్యక్రమం నిర్వహించారు.

గంగాధర: గంగాధరలోజరిగిన కార్యక్రమంలో యేసు సిలువ మీద మృతిచెందిన సందర్భం శాంతి, ప్రేమ అంశాలపై పాస్టర్లు వాక్యోపదేశం చేశారు. చర్చిల్లో నాటికలు, ప్రత్యేక గీతాలతో సందడి నెలకొంది. ఈస్టర్ పండుగసందర్భంగా చర్చిల్లో విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల పాస్టర్లు ధర్మతేజ, యాదిప్రకాశ్, పీటర్, తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: హోలీ షాలమ్ చర్చిలో ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బిషప్ గుండేటి శాంతికుమార్ దైవోపదేశం చేశారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వీణవంక: మండలంలోని బేతిగల్‌తోపాటు పలుగ్రామాల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బేతిగల్ చర్చిలో ప్రత్యేక విందును ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో పాస్టర్ జీవరత్నం, శ్రీరామ్ టోని, శ్రీరాము తదితరులున్నారు.

మానకొండూర్: మండలంలోని కొండపల్కల గ్రామ చర్చిలో ఈస్టర్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్‌కట్ చేసి స్వీట్ల పంపిణీ చేసి సహపంక్తి భోజనం చేశారు. పాస్టర్ జయరాజు, ప్రసాద్, భాగ్య, దావీద్, యోన, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని అన్ని గ్రామాల్లోని చర్చిల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. 40రోజులు ఉపవాస దీక్షలు చేపట్టిన క్రైస్తవులు విరమణ చేశారు. ఆయా కార్యక్రమాల్లో పాస్టర్లు అబ్రహం, పౌలు, మోజెను, క్రాంతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.


హుజూరాబాద్‌లో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


గంగాధరలో వాక్యోపదేశం చేస్తున్న పాస్టర్ యాది ప్రకాశ్

గుంతలమయంగా లలితాపూర్ రోడ్డు

మానకొండూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లలితాపూర్ గ్రామశివారులో కరీంనగర్-జమ్మికుంట ప్రధానరహదారి గుంతల మయంగా తయారయింది. ఈ రోడ్డుపై నిత్యం వాహనాలు ఉదయం నుంచి రాత్రి వరకు నడుస్తూనే ఉంటాయి. ప్రధాన రహదారి గుంతల మయంగా తయారు కావడంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని గుంతలను పూడ్చివేసి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.


లలితాపూర్‌లో గుంతలమయంగా తారు రోడ్డు

27న మోడల్ స్కూల్ ప్రవేశాలకు పరీక్ష

ఇల్లందకుంట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకుర్తి మోడల్‌స్కూల్‌లో 2025-26విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు ఈనెల 27న ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అయిలయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 27న ఉదయం 10నుంచి 12గంటల వరకు 6వ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4గంటల వరకు 7వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఈనెల 21న సంబంధిత ప్రభుత్వ వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. గంట ముందే పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని కోరారు.

హాకీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శికి సన్మానం

హుజూరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక హైస్కూల్ క్రీడామైదానంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన హాకీ క్లబ్ అధ్యక్షుడు తోట రాజేంద్రప్రసాద్, కార్యదర్శి బి తిరుపతిని ఆదివారం ఘనంగా సన్మానించారు. హాకీ క్రీడాకోసం అహర్నిశలు కృషి చేయాలని వారిని కోరారు. కార్యక్రమంలో బి శ్రీనివాస్, కె శ్రీనివాస్, ఉమామహేశ్వర్, సజ్జు, తదితరులు పాల్గొన్నారు.

నియామకం

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన తునికి సమ్మయ్యను తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్రకార్యదర్శిగా నియమిస్తూ ఆ సంఘం గజ్జెల కాంతం నియామక ఉత్తర్వులు అందించారు. జిల్లాకేంద్రంలో తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం సమావేశంలో ఈ నియామకం జరిగింది.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

రామడుగు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆల్ ఇండియా రెడ్డి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బీరెడ్డి కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బైరి గంగిరెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తక్షణమే రుణమాఫీ, రైతుబంధు రైతుల అకౌంట్‌లో జమ చేయాలని అన్నారు.